
క్లుప్తంగా

ఆస్పత్రిలో మురుగు కంపు



ఆస్పత్రిలో నిల్వ ఉన్న మురుగు నీరు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అత్యవసర విభాగం వెనుక భాగం కంపు కొడుతోంది. పారిశుధ్య, నిర్వహణ లోపం కారణంగా భవనాలకు మధ్య ఉన్న ఖాళీ స్థలం మురుగుతో నిండిపోయింది. ఈ మురుగు నిల్వలతో ఆ ప్రాంతం చెరువును తలపిస్తోంది. అటువైపు వెళితే కంపు కొడుతోంది. వైద్యాధికారులు, సిబ్బంది ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి. రెండు నెలలుగా ఈ పరిస్థితి ఉందని రోగులు, ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి.

కాణిపాకంలో ప్రిన్సిపల్ సెక్రటరీ



చిత్రపటం అందుకుంటున్న ప్రిన్సిపల్ సెక్రటరీ చక్రవర్తి

కాణిపాకం: రాష్ట్రఎలక్షన్ కమిషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ చక్రవర్తి శనివారం కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికి, దర్శన సేవలు అందించారు. ఆశీర్వచన మండపంలో పండితులు ఆశీర్వచనాలు పలికి, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది వాసు పాల్గొన్నారు.

అందని సోలార్

- ముంచుకొస్తున్న గడువు
- లక్ష్యం 6 వేల కనెక్షన్లు, పూర్తి చేసింది 180 మాత్రమే

చిత్తూరు కార్పొరేషన్: సొంతింటిపైకప్పు మీద సౌర ఫలకాల ద్వారా లబ్ధిదారులకు విద్యుత్ అందించాలని కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ యోజన పథకాన్ని అమలు చేస్తోంది. కానీ జిల్లాలో వీటి అమలు ఆశించిన స్థాయిలో లేకుండా మందకొడిగా సాగుతోంది. మార్చి నాటికి జిల్లాలో తొలిదశలో 6,000 కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ ఇప్పటి వరకు అందులో 4 శాతం కూడా క్షేత్ర స్థాయిలో పనులు కాలేదు. జిల్లాలో కేవలం 180 కనెక్షన్లు మాత్రమే ఇన్‌స్టాల్ చేశారు. చిత్తూరు నగరంలోనే 70కి పైగా సర్వీసులు బిగించారు. పట్టణాల్లో తప్ప గ్రామాల్లో ప్రజలు ఈ పథకంపై ఆసక్తి చూపడం లేదు. ప్రజలకు దీనిపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం కావడం, బ్యాంకుల సహకారం కొరవడటం ఇందుకు ప్రధాన కారణాలని చెప్పవచ్చు. ఈ సౌర పథకాన్ని ఎస్సీ ఎస్టీలకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌కు అనుసంధానం చేయనున్నారు.

లక్ష్యం 6 వేలు.. పూర్తిచేసింది 180

కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఫిబ్రవరిలో పీఎం సూర్యఘర్ యోజన పేరు మీద సౌర విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. వీటి కింద సొసైటీలు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, వ్యక్తిగత గృహ సముదాయాలకు రాయితీపై సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్‌ను ఇన్‌స్టాల్ చేస్తున్నారు. మార్చి నాటికి జిల్లాలో 6 వేల సర్వీసులు బిగించాలని లక్ష్యంగా నిర్దేశించారు. జనవరి వరకు జిల్లాలో 2,000 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 180 కనెక్షన్లు మాత్రమే ఇచ్చారు. మరో 200 సర్వీసుల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. క్షేత్రస్థాయిలో నిర్దేశించిన లక్ష్యంలో ఇప్పటి వరకు దాదాపు 3 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు.



పీఎం సూర్యఘర్ కరపత్రం

- మొత్తం విద్యుత్ వినియోగం ఆధారంగా 150 యూనిట్లలోపు వినియోగం ఉన్న వారికి 1 నుంచి 2 కిలోవాట్ ప్యానల్స్, 150–300 యూనిట్లు వినియోగించే ఇళ్లకు 2 నుంచి 3 కిలోవాట్ల ప్యానల్స్, 300 యూనిట్లు కంటే ఎక్కువ వాడేవారికి 3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ ప్యానల్స్ ఇన్‌స్టాల్ చేస్తారు.
- రూ.2 లక్షల విలువైన 3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.78 వేల రాయితీ కల్పించింది. రూ.20 వేలు లబ్ధిదారు వాటాపోను మిగిలిన మొత్తానికి ఏడు శాతం తక్కువ వడ్డీతో బ్యాంకు రుణం పొందవచ్చు.
- ఈ వ్యవస్థ ద్వారా ఏడాదికి దాదాపు రూ.32 వేలు ఆదా అవుతుంది. గృహ అవసరాలకు వినియోగించుకున్న తర్వాత మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా యూనిట్‌కు రూ.2.09 ఆదాయం పొందవచ్చు.
- రుణాన్ని పొందేందుకు బ్యాంకులకు సెక్యూరిటీ కింద ఎటువంటి డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు. అధికారులు సమయం దొరికినప్పుడల్లా సమీక్ష సమావేశాలు నిర్వహించి పురోగతిని పెంచాలి. అవసరాన్ని బట్టి ఇతరశాఖల ఉద్యోగుల సహకారం తీసుకోవాలి.



చిత్తూరు నగరంలో ఏర్పాటు చేసిన సౌరఫలకాలు

- ప్రస్తుతం బ్యాంకు రుణం ప్రశ్నార్థకంగా మారింది. జీరో డాక్యుమెంటేషన్‌తో బ్యాంకులు లబ్ధిదారులకు రుణం మంజూరు చేయాలి. కానీ బ్యాంకర్లు ష్యూరిటీ కోరుతుండడంతో స్పందన లేదని వెండర్లు చెబుతున్నారు.
- జిల్లాలో ఎస్టీ సర్వీసులు 28,230, ఎస్సీలు 1,15,250 మంది ఉచిత విద్యుత్ 200 యూనిట్లు పొందుతున్నారు. వీరికి సౌరవిద్యుత్ పథకం అనుసంధానం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై సర్వే చేసి వివరాలను అందించనున్నారు.
- తొలుత కాలనీల్లో నివాసముండే ఎస్సీ ఎస్టీలకు సౌరవిద్యుత్ ఏర్పాటులో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు అంటున్నారు. బ్యాంకు రుణం మొత్తాన్ని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా చెల్లించే విధంగా ప్రణాళికల్లో ఉన్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు.



అవగాహన కల్పిస్తున్నాం

సౌరవిద్యుత్ మీద వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ పథకం ద్వారా మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అమ్ముకోవచ్చు. వీటిపై గ్రామ స్థాయి నుంచి నగర పరిధి వరకు మరింత ప్రచారం చేయనున్నాం. ఎస్టీ ఎస్టీ సర్వీసులకు సోలార్ విద్యుత్ పథకాన్ని అనుసంధానం చేయనున్నాం. గడువులోగా నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని నిర్దేశించుకున్నాం.

–ఇస్మాయిల్‌అహ్మద్, ఎస్ఈ, ట్రాన్స్‌కో

నేడు సంక్రాంతి సంబరాలు



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా రచయితల సంఘం, ఎంవి కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు శ్రీధర్‌రెడ్డి, సహదేవనాయుడు పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సంక్రాంతి సంబరాలను ఆదివారం నాగయ్యకళాక్షేత్రంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందనానరు. పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన 200 మందికి సన్మానం ఉంటుందని వారు పేర్కొన్నారు.

పశువుల షెడ్డు ప్రారంభం



షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె: మండల కేంద్రంలో గోకులం పథకం కింద నూతనంగా నిర్మించిన పశువుల షెడ్డును శనివారం పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.2.30 లక్షలతో పశువుల షెడ్డును నిర్మించారు. పశువుల షెడ్డును ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ గోకులం పథకంను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల షెడ్లను రైతులందరూ సకాలంలో నిర్మించి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డిబాబు, ఏపీడీ సుబ్రమణ్యం, ఏపీఓ లలిత, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో గర్భిణులకు ఆరోగ్యం

తవణంపల్లె: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ కూడా ఆరోగ్యంగా జన్మిస్తారని డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని కారకాంపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భందాల్చిన మహిళలు ఆరోగ్యంగా ఉండాలన్నారు. దీంతో జన్మించే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తప్పక వాడాలని పేర్కొన్నారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని సూచించారు. ప్రతి నెలా పరీక్షలు చేయించుకుని ఐరన్ మాత్రలు వాడాలన్నారు. శీతాకాలంలోనూ వ్యాపించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కారకాంపల్లెలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

అనుమతి లేదు.. సీసీరోడ్డు ఎలా వేశారు?

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు మండలం దిగువమాసాపల్లి పంచాయతీ దిగువ కండ్రిగ గ్రామంలో ఓ రోడ్డుకు ఎలాంటి అనుమతి లేకుండా సీసీ రోడ్డు వేశారని అధికారులకు ఫిర్యాదు అందింది. రూ.2 లక్షలు వ్యయం చేసే రోడ్డును అనధికారికంగా ఎలా వేస్తారంటూ ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితమే ఇదే పంచాయతీలోని అప్పయ్యగారిపల్లిలో అనుమతి లేకుండా విచ్చలవిడిగా రోడ్లు వేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు అందడంతో విచారణకు దిగిన అధికారులు తమకు ఎలాంటి సంబంధం లేదని చేతులెత్తేశారు. ఇది మరవక ముందే మరో రోడ్డు వెలుగులోకి వచ్చింది. నాలుగు రోజుల క్రితమే దిగువ కండ్రిగలో అనుమతి లేకుండా సీసీ రోడ్డు వేశారని ఫిర్యాదులు వస్తున్నాయి. పక్కన ఉన్న రోడ్డు పేరు చెప్పి అనుమతి ఉందని ఈ రోడ్డును అనుమతి లేకుండా వేశారని అంటున్నారు. ఈ రోడ్డు వ్యవహారం కూడా ఆ డివిజన్‌స్థాయి అధికారి ప్రోత్సాహంతో జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



దిగువ కండ్రిగలో వేసిన సీసీరోడ్డు

భక్తిశ్రద్ధలతో ద్వాదశి వేడుకలు

కార్వేటినగరం: శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ద్వాదశి వేడుకలు వైభవంగా ముగిశాయి. రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించారు. అనంతరం తిరుప్పావై కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో కొలువుదీరిన శ్రీ సీత, రాముల వారి మూలవర్లకు అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నమాచార్య సంగీత కచేరి బృందం హరికథా కాలక్షేపం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబుసురేష్, వేద పండితులు పాల్గొన్నారు.



ఊరేగింపులో స్వామి అమ్మవారు

చలి-పులి



చిత్తూరులో చలి చంపేస్తోంది. రెండు రోజులుగా ఎండ జాడ లేదు. కారుమబ్బులు కమ్ముకుని చలిగాలులు వీస్తున్నాయి. అసలే శీతాకాలం.. దీనికి తోడు సాయంత్రం 5 గంటలకే మంచు మొదలవుతోంది. చీకటి పడగానే చలి పంజా విసురుతోంది. చిత్తూరు నగరంలోని జిల్లా ఆస్పత్రిలో మెడికల్ వార్డులో కిటికీలకు తలుపులు సక్రమంగా లేవు. చలికి తట్టుకోలేక కిటికీలకు పరదాలు కట్టిపెట్టారు. అయినప్పటికీ రోగులు గజగజ వణికిపోతున్నారు. బెడ్‌షీట్లు కప్పుకున్నప్పటికీ చలికి తట్టుకోలేకపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా చలిపులి జనాన్ని వణికించేస్తోంది.

–చిత్తూరు రూరల్ (కాణిపాకం)

ముందస్తు సంక్రాంతి వేడుకలు

గుడిపాల: స్థానిక సీఎస్ఆర్ విద్యా సంస్థలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత లోకేష్ మాట్లాడుతూ మన దేశ సంస్కృతి ,సంప్రదాయాలు పాటించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. గాలిపటాలు ఎగురవేసి విద్యార్థులు పొంగళ్లు పెట్టారు. గొబ్బెమ్మ పాటలు, భోగి మంటలు, హరిదాసు వేషధారణ, గంగిరెద్దుల వేషం, సోది చెప్పే వారు, బుడబుడకల వారి నాటకాలు పలువురిని ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులతో విద్యార్థులను అలరించాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పలు రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర, ప్రధాన ఉపాధ్యాయురాలు సుధా, అధ్యాపకులు పాల్గొన్నారు.



వేడుకల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు

పండుగల విశిష్టతను విద్యార్థులు తెలుసుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు పండుగల గొప్పదనాన్ని తెలుసుకోవాలని విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి తెలిపారు. నగరంలోని మిట్టూరులో ఉన్న విజయం డిగ్రీ కళాశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించడాన్ని మకర సంక్రాంతి అంటారని వివరించారు. ఈ పండుగ హిందువులకు అతి పెద్ద పండుగ అని చెప్పారు. వ్యవసాయం ప్రధానమైన మన దేశంలో పంటలు చేతికొచ్చే కాలం ఇది అని అన్నారు. సంక్రాంతి పండుగను ఆధ్యాత్మికతతో సంప్రదాయాలతో జరుపుకుంటారని చెప్పారు. అకడమిక్ డైరెక్టర్ శైలజ మాట్లాడుతూ మంచి పనికి కాలంలో పనిలేదని సిద్ధాంతాన్ని పక్కన పెడితే కొన్ని కాలాల్లో సానుకూలమైన పరిస్థితి ఉంటుందన్నారు. 12 ఏళ్లకు ఓ సారి వచ్చే మకర సంక్రాంతి రోజున కుంభమేళా సైతం నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం విద్యార్థులు భోగిమంటలు వేసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



భోగిమంటను వెలిగిస్తున్న తేజోమూర్తి

గోకులం షెడ్డు ప్రారంభోత్సవం

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామంలో శనివారం గోకులం షెడ్డును ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ నాయుడు ప్రారంభించారు. రెండు షెడ్లులను ప్రారంభించి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పాడి పరిశ్రమను వృద్ధి చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

యాదమరిలో...

పాడి పరిశ్రమలను ప్రోత్సహించేందుకే గోకులం షెడ్డు పథకాన్ని తీసుకొచ్చారని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. యాదమరి మండలం 184 గొల్లపల్లిలో గోకులం షెడ్డును ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ షెడ్డు నిర్మాణం చేపట్టారని, ఇందుకు రైతులకు ప్రభుత్వం రుణసాయం చేస్తోందన్నారు. అనంతరం అధికారులు నియోజకవర్గంలో చేపడుతున్న షెడ్ల వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

ఐరాల: ప్రజలు నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి, లేకపోతే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 66 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న చోటా దోమలు వృద్ధి చెంది ప్రాణాంతకరమైన వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని చెప్పారు. దోమకాటుతో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో అర్హులైన యువత ప్రధానమంత్రి ఇంటర్న్‌షి ప్ కార్యక్రమానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అ ధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మా ట్లాడారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా పీఎం ఇంటర్న్‌షిప్ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. దరఖాస్తు చేసుకునే యువతకు 12 నెలల శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో నెలకు రూ.6 వేలు ప్రోత్సాహక భృతి ఇస్తారన్నారు. 21 నుంచి 24 ఏళ్ల వయస్సు ఉండి పది, ఇంటర్, ఐఐటీ, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసిన యువత అర్హులన్నారు. బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సైతం పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు www.pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 21 లోపు పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 95056 01887, 84658 30771 నంబర్లలో సంప్రదించాలని కోరారు.





